
# శాంతి
# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

July / జూలై -2023

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్



పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్

జననం : 1895 మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత

# శాంతి
# SANTI


**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 99 July / జూలై -2023 No./ సంచిక : 7


| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన - నిరఞ్జనాష్టకమ్ (శ్రీ శంకరాచార్య విరచితం) | 2 |
| 2. | ధ్యానము - శ్రీ శంకరాచార్యవిరచిత కాశీపంచకము | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | "మతైక్యం కావాలి, ఏకమతం కాదు" (చంద్రశేఖర సరస్వతీ మహాస్వామివారు) | 7 |
| 5. | ఆనంద రామాయణము - పరిష్కర్త: స్వామి సత్యాత్మానంద | 10 |
| 6. | గురువాచకకోవై - మురుగనార్ | 12 |
| 7. | తులసీ సర్వస్వము- శ్రీ జి.వి.యస్. సుబ్రహ్మణ్యం | 19 |
| 8. | కార్యక్రమములు - విరాళములు | 25 |

**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-**



# ప్రార్థన

## శ్రీ శంకరాచార్యకృత నిరఞ్జనాష్టకమ్

**శ్లో॥ అఖణ్డదణ్డం న చ దణ్డదణ్డ్యం,**
**కాలోపి జీవో న గురు ర్న శిష్యః ।**
**గ్రహో న తారా న చ మేఘమాలా,**
**తస్మై నమో బ్రహ్మనిరఞ్జనాయ॥**

ఖండాఖండములు గాక, దండదండనీయులు గాక, కాలము గాక, జీవుడు గాక, గురుశిష్యులు గాక, గ్రహనక్షత్రములు గాక, మేఘమాల గాక ఒప్పుచుండెడు నిరంజన బ్రహ్మమునకు నమస్కారము.

# ధ్యానము

## శ్రీ శంకరాచార్యకృత కాశీపంచకమ్

**శ్లో॥ కాశీక్షేత్రం శరీరం త్రిభువన జననీ వ్యాపినీ జ్ఞానగంగా**
**భక్తిశ్శ్రద్ధాగయేయం నిజగురుచరణ ధ్యానయోగ ప్రయాగః ।**
**విశ్వేశోఽయం తురీయ స్సకల జనమన స్సాక్షి భూతోంతరాత్మా**
**దేహే సర్వం మదీయే యది వసతి పున స్తీర్థమన్యత్కిమస్తి ॥**

కాశీక్షేత్రము నా శరీరము - ముల్లోకములకు తల్లియై, ముల్లోకములను వ్యాపించి యున్న జ్ఞానరూపమగు గంగయే బ్రహ్మము ప్రతిఫలించిన చిత్తము. గయాక్షేత్రము నాకు గల ఆస్తిక్యబుద్ధియే. ప్రయాగ క్షేత్రము స్వగురు చరణములను ధ్యానించుటలో నాకు గల చిత్తైకాగ్ర్యమను యోగమే. విశ్వేశ్వరుడు సకల జనుల యొక్క మానసిక వృత్తులకు సాక్షియైన అంతరాత్మ. ఇట్లు నా దేహముననే సర్వ తీర్థములును నివసించి యుండగా నాచే సేవింపదగిన పుణ్యతీర్థము మరియొకటి యేమి కలదు.

ఇతరుల ఉపన్యాసము వలన, అధికగ్రంథపఠనము వలన మన ఆధ్యాత్మికాభివృద్ధి చెందదు. తాను చదివినది, వినినది కొంచెమైనను మరల మరల మననము చేసి దానిలోని అంతరార్థము అర్థము చేసుకొనినచో దాని మహిమను స్వయముగా గ్రహించి నిజమైన ఆనందము పొందగలము. **- శ్రీ స్వామి ఓంకార్**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

## అధ్యాయం - 44

### జంతుబలులు

భారతదేశంలో ధార్మికత ఎంత ఉన్నతస్థాయిలో ఉంటుందో, అలాగే చాలా ప్రదేశాల్లో అనాగరిక, అమాయక ప్రజల్లో మత మౌఢ్యం, దురాచారాలు కూడా అంతేస్థాయిలో బాగా ప్రబలిపోయి ఉండడం వలన భయంకరమయిన పరిస్థితుల్లో వారు చిక్కుకుపోతున్నారు. ప్రకృతి సహజసిద్ధంగా వచ్చే ఇబ్బందులు, జబ్బుల నుండి తప్పించుకోవడానికి ప్రజలు మూర్ఖంగా గ్రామదేవతలకి జంతువులను బలులు ఇవ్వటం అనే దురాచారం బాగా ఉంది.

అనాగరికులు, నిరక్షరాస్యులు, అమాయకులు, నాగరిక ప్రపంచానికి దూరంగా ఉండే జాలరుల కుటుంబాలలో ఈ విధమయిన అనాగరిక దురాచారం చాలా కాలంగా కొనసాగుతూ వస్తోందని మేము తెలుసుకున్నాము. అది చాలా భయంకర మయిన, ప్రమాదకరమయిన ఆచారము అని వారికి అర్థం అయ్యేవిధంగా వారిలో అవగాహన కల్గించాలని భావించేవారు లేకుండా పోయారు. వారి కులాచారాలు కుల పెద్దల నుండి అలాగే కొనసాగుతూ వస్తున్నాయి. అమ్మవారుగా వారు తలచే దేవతకు రక్తతర్పణం చేసి జంతువులను, మూగజీవాలను బలులుగా సమర్పిస్తే ఆమె సంతృప్తి చెంది తమ జాతిని రక్షించి కాపాడుతుంది అని మూఢంగా నమ్మి ఆచరించేవారు.

చుట్టుప్రక్కల జాలరుల కుటుంబాల కులపెద్దలను, పూజారులను అందరిని పిలిపించి, ఆశ్రమములో సమావేశం ఏర్పాటు చేసి గంటలకొద్ది వారికి అవగాహన కల్గించేవారము. ఆ విధంగా చాలారోజులు ఓపిగ్గా, వారి అంతరాంతరాళాల్లో గూడు కట్టుకొనిపోయిన ఛాందసాలను, మూఢవిశ్వాసాలను, భయాన్ని తొలగించడానికి ప్రయత్నించాము. వీరందరూ ప్రకృతిమాత పుత్రులు. వారిలో అణగారిపోయిన దివ్యత్వాన్ని వెలికితీసి, పరమాత్ముని శరణాగతి చెందటము నేర్పించాము. భగవంతుడు సర్వశక్తిమంతుడే కాదు, అపారమయిన కరుణా సముద్రుడని, దయామయుడని, వారినుండి కేవలము భక్తితత్పరత మాత్రమే కోరుకుంటాడని, వారు ఇతరులకి, కుటుంబసభ్యులకు, స్నేహితులకు, బంధువులకి మేలు చేస్తే అందులకు సంతోషించి ఆయన వారికి సహాయం చేస్తాడని, వారి సంరక్షణ బాధ్యత పరమాత్మే స్వయంగా వహిస్తాడని బోధించాము. వారు జంతుబలులు సమర్పించినందువలన భగవంతుని దయకు దూరమయిపోతారని వివరించి చెప్పాము. చిట్టచివరికి మా ప్రయత్నాలు,



ప్రబోధాలు ఫలించి వారందరూ ఇక మీదట ఈ దురాచారాలన్నీ మానివేస్తామని ప్రమాణం చేశారు. ఇసుక తిన్నెల మీదుగా వారి గ్రామాలకు తిరిగి వెళ్ళేముందు అందరూ కలిసి సామూహికంగా భగవంతుని కీర్తిస్తూ భజనలు, సంకీర్తనలు చేస్తూ భగవన్నామాన్ని జపించారు.

దయామయుడు ప్రేమమూర్తి అయిన ఈశ్వరుని అనుగ్రహము వలన ఒక అద్భుతము జరిగినట్లుగా వారి హృదయాల్లోని భయాలన్నీ పటాపంచలయిపోయాయి. వారిలో క్రొత్తగా ఏర్పడిన నమ్మకానికి అతి తొందరలోనే పరీక్ష ఎదురయింది. వారి సంప్రదాయం ప్రకారం ఆచారబద్ధంగా వారు నిర్వహించుకునే అతి ముఖ్యమయిన పండుగ దినం రానేవచ్చింది. అమ్మవారి పండుగ దినం నాడు సముద్రపు ఒడ్డున చిన్న తాటాకులు కప్పిన దేవాలయంలాంటి ప్రదేశానికి రంగు రంగుల దుస్తులు, అలంకారాలతో జాలరుల కుటుంబాలన్నీ చేరుకున్నాయి. ఆశ్రమములో అంతకు ముందు రోజురాత్రి మేమందరము ఆధ్యాత్మిక చింతనలో గాఢమయిన ధ్యానము, ప్రార్థనతో గడిపాము. చెడును నిర్మూలించాలంటే అనంతమయిన ధార్మికశక్తిని కూడగట్టుకోవాల్సి ఉంటుంది.

గ్రామ పూజారులు జాతరకు సంబంధించిన వింతదుస్తులు, అలంకారాలతో, ఒంటినిండా రకరకాల ముద్రలు ముద్రించుకుని అలంకరించుకుని వచ్చారు. గుండ్రంగా కూర్చుని వాద్యకారులు, నృత్యం చేసేవారు. భయం కలిగించే విధంగా కొమ్ముబూరలు, డప్పులు వాయిస్తూ భయానకమయిన వాతావరణాన్ని సృష్టించారు. మూగజీవాలను అమ్మవారికి బలి ఇవ్వడానికి తీసుకువచ్చారు. బలిపీఠాన్ని అలంకరించి దాని వద్దకు ఆ జంతువులను తెచ్చారు. ఇక మిగిలిన తంతు పూర్తి చేయడానికి వారందరూ సిద్ధంగా ఉన్నారు. ఆశ్రమవాసులందరూ ఆ గుంపులో చొరబడి బలిపీఠం దగ్గరికి చేరుకున్నారు. మేము పూజారి వద్దకు చేరుకుని, అతనిలో తరతరాల నుండి వస్తున్న ఆచార సంప్రదాయాలను మీరటం వలన కల్గుతున్న భయాందోళనలను, అతని అంతరంగంలో జరుగుతున్న భయంకరమయిన కల్లోలాన్ని గుర్తించి, అతని సందేహాలన్నింటిని రూపుమాసిపోయే విధంగా అతనితో మాట్లాడాము. “దయచేసి ఈ మూగజీవాలను భగవంతుని ప్రేమకు వదిలిపెట్టండి. మీ అనుమతితో మేము ఇప్పుడు ఇక్కడ ఆ జగన్మాతకు ప్రీతిని కలిగించే పూజాదికాలు చేసుకుందాము” అని చెప్పి ఒప్పించడానికి ప్రయత్నించాము.

గుంపులో చిన్నగా గుసగుసలు వినిపించాయి. ఇదింతా మంచికి, చెడుకి మధ్య జరుగుతున్న సంగ్రామంలా అనిపిస్తోంది. అక్కడి వాతావరణంలో గాలికూడా భయాందోళనలతో వేడెక్కిపోయింది అనిపిస్తోంది. గొంతు తడారిపోతోంది. శరీరంలోని ప్రతి అణువు, హృదయము ఆందోళనతో కంపించసాగాయి.

తొందరగా, చాలా జాగ్రత్తగా బలి కోసం తీసుకురాబడిన చిన్ని గోధుమ రంగు గొఱ్ఱెపిల్లని, పాలుత్రాగే వయస్సున్న చిన్ని పందిపిల్లని, కోళ్ళను వదలిపెట్టాము. వాటిని జాగ్రత్తగా సంరక్షించేవారికి అప్పగించాము. అక్కడ గుంపుగా నిలబడిన వారందరూ మౌనంగా, గౌరవంగా దారి వదిలారు. ఏ మాత్రం అజాగ్రత్త, అశ్రద్ధ వహించినా ఆ మూగజీవాలు ఏమయి ఉండేవో తలచుకుంటే మా గుండెలు భయంతో కదిలిపోయాయి. మానవత్వం, కనికరం లేని ఆ పూజారుల చేతిలో అవి బలయి ఉండేవి.

ఇక అక్కడ గుమిగూడిన వారందరి కోసం, వారు అప్పటిదాకా ఆచరిస్తూ వస్తున్న భయంకరము, అనాగరికము, క్రూరమయిన పూజాదికాలకు ప్రత్యామ్నాయంగా మేము చాలా ప్రశాంతమయిన, అందమయిన, అందరిని ఆకర్షించే క్రతువును నిర్వహించాము. అగ్నికార్యం అతి పవిత్రమయింది. అది పరంజ్యోతి స్వరూపం. నెయ్యి, సమిధలు, పూలు, అగరబత్తీలు, కొద్దిగా ధాన్యపు గింజలు సమర్పించాము. ఇక జాలరుల కులపెద్దలను, పూజారులను అందులో ముఖ్యమయిన పాత్ర వహించేలా శ్రద్ధ తీసుకున్నాము. దాని వలన వారు కూడా సంతోషించారు. వేడుకలు, ఉత్సవాన్ని చూడడానికి గుంపులుగా వచ్చిన వారందరి ఎదుట వారికి గౌరవము, ఉన్నతమయిన స్థాయి లభించడము వలన అప్పటిదాకా ముఖాలు వ్రేలాడ దీసుకున్న పూజారులు అది చాలా గౌరవంగా భావించారు. చాలా తొందరలోనే ఆ స్థలములో పూర్వమునుండి వారు ఆచరిస్తూ వస్తున్న అనాగరిక చర్యలు, బలులు వంటి అకృత్యాలు, దురాచారాలు సమసిపోయాయి. ఇప్పుడు అక్కడ నిత్యమూ దీప ధూప నైవేద్యాలతో, హారతులతో పవిత్రమయిన హృదయాలతో పూజారులు అఖిలాండ కోటిబ్రహ్మాండనాయకికి, జగన్మాతకు పూజలు నిర్వహిస్తున్నారు. అది చూచి సముద్రము కూడా సంతోషంతో ఎగిసిపడుతోందా అనిపిస్తోంది. వెలుగులు, అందము నిండిన అలలు ప్రశాంతంగా, ఆనందంగా ఆశీర్వదిస్తున్నట్లుగా ఎగిసిపడుతున్నాయి. జాలరుల కులపెద్దలు, పూజారులు, వేడుకలు తిలకించడానికి వచ్చిన ప్రజలు అందరి హృదయాలలో ఒక సరిక్రొత్త కాంతిరేఖలు నిండిపోయాయి.

బెస్త ప్రజలందరూ దానితో ఇకమీదట ఎలాంటి జంతుబలులు ఇవ్వమని వారంతటవారుగా ప్రమాణాలు చేశారు. అతి తొందరలోనే మరొక పర్వదినము వచ్చినప్పుడు వారందరూ ఇచ్చిన మాట తప్పకుండా అమ్మవారిని చక్కగా పూలతో అలంకరించి ప్రేమ నిండిన హృదయాలతో, భక్తిగా ఆరాధనలు జరుపుకోవటం మాకు ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని కలిగించింది. మా హృదయాలు సంతృప్తితో నిండిపోయి వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్పాము. భగవంతుని అనుగ్రహం, సహకారం వలన ఈ పేద బెస్త ప్రజలకి చేతనయినంత సహాయం అందించి వారిని



సంతోషంగా జీవించేలా చేయగలిగాము. నిజానికి అది చాలా పెద్ద బాధ్యత. దాన్ని మేము సక్రమంగా నిర్వర్తించగలగటం వలన జాలరుల కుటుంబాల వారందరికి మాపైన భక్తి విశ్వాసాలు నమ్మకము పెరిగాయి.

ఈ విధంగా ప్రపంచ వ్యాప్తంగా అజ్ఞానం అనే అంధకారములో అల్లాడుతున్న వారు ఎందరో ఉన్నారు. వారందరికి జ్ఞానజ్యోతిని అందించడానికి, వారి జీవితాలలో వెలుగు, ఆనందం నింపటానికి, తూర్పు పడమరదేశాల్లోని పవిత్రమయిన ఆత్మ స్వరూపుల సహాయ సహకారాలు ధన రూపేణ, సేవా రూపేణా కావాల్సి ఉంటుంది. నాతో కలిసి నడవడానికి, చేతులు చాచి ఆహ్వానిస్తున్నాము. కష్టపడి అంకితభావంతో పనిచేసేవారు ఎందరో కావాల్సి ఉంటుంది. మాపై ఉన్న బాధ్యతలను, భారాన్ని పంచుకోవడానికి, ఆర్థిక సాయం అందించడానికి, పనిచేయడానికి మీ సహాయం మాకు కావాలి. భగవంతుడు ఎల్లప్పుడు ఆ బెస్తవారికి చక్కని మార్గదర్శకాన్ని, అనుగ్రహాన్ని, జ్ఞానాన్ని ఇచ్చి వారిని సదా రక్షించుగాక! అలాగే అలాంటి వారికి సహకరించే హస్తాలను దీవించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేవుని బిడ్డలకు మరింత సేవ చేయడానికి కావాల్సిన శక్తి సామర్థ్యాలను వారికి ప్రసాదించుగాక! శాంతిని శ్వాస ద్వారా లోపలికి పీల్చి వదలటము మన జన్మహక్కు ప్రతి శ్వాస ద్వారా శాంతిని లోనికి పీల్చి వదలటం ద్వారా మనము ఏమి సాధించగలము? అని భావించవచ్చు. ఈ ఉన్నతమయిన క్షణాలు శాశ్వతమగు గాక! ఎవరికయితే వ్యక్తిగతమయిన శాంతి లభిస్తుందో తద్వారా వారు ప్రపంచశాంతికి తోడ్పడుతారు. మనలో ఎవ్వరమూ ఇతరులను మార్చలేకపోవచ్చు. ఈ ప్రపంచానికి క్రొత్తరూపాన్ని ఇవ్వలేకపోవచ్చును. కానీ మనలను మనము మార్చుకోగలము కదా! స్వార్థపూరితమయిన మనస్సును నిస్వార్థంగా మార్చి మానవత్వము నుండి దివ్యత్వము వైపుగా పయనించగలము. ఆ విధంగా మనము మారితే, నిశ్శబ్దంగా మనము సమస్తమానవాళికి సేవలందించ గల్గుతాము.

భగవంతుని ఆశీర్వచనాలు మీకుండు గాక! మీ జీవితాలు ప్రపంచానికి ఆదర్శంగా మారి ఒక వరంలాగా అవుతుంది. శాంతి కేంద్రముయొక్క శాంతి సందేశాలను మీరు ప్రపంచానికంతటికి పంచిపెట్టెదరు గాక!

ఓం... ఓం... ఓం...

ఆధ్యాత్మిక గ్రంథములను, మతగ్రంథములను నెంతగ చదివవినను ఆ చదువు శ్రద్ధాళువైన సాధకునకు సత్యదర్శనమునకు సహాయకారి కాజాలదు. ఏకైక లక్ష్యముతో, స్వీయసాధనతో సత్యదర్శన ప్రతిబంధకములగు మనోమాలిన్యము లను తొలగించు కొనుటే యాతని ప్రముఖ కర్తవ్యము. **– శ్రీ పప్పా రామదాసు**

నీవు చదివే విషయాన్ని బాగా గ్రహించుకో, గ్రహించినదానిని మననం చేస్తూ ఉండు. అలా మననం చేసినదానిని ఆచరణలో పెట్టు. **– శ్రీ సాయిబాబా**

# "మతైక్యం కావాలి, ఏకమతం కాదు"

**శ్రీ చంద్రశేఖర సరస్వతీ మహాస్వామివారు**

లోకంలో పసివాళ్ళందరిదీ ఒకటే మతం. కల్లాకపటం ఎరుగక స్ఫటికం వలె స్వచ్ఛంగావుండేవాళ్ళ మనస్సులకు మతభేదాలంటూ లేవు. అంతలో కళ్ళవెంట నీళ్ళు పెట్టుకుంటూ అంతలో కలకలనవ్వుతూ ఉండటమేగాని, వాళ్ళ మనస్సులకు ఇంకా సుఖదుఃఖాల మాలిన్యం అంటుకోలేదు కనుకనే వాళ్ళు ఈశ్వరస్వరూపులు. ఈశ్వరవిగ్రహాన్ని చూడగానే 'హరహరా' అంటూ చిట్టిచేతులతో చెంపలు వాయించు కోడమే వాళ్ళెరిగిన మతం. సరళాతిసరళమయిన ఆ మతంలో సంశయాలకు తావు లేదు. మనంగూడా పదిమందిమీ ఒక్కసారి గొంతు విప్పి "హరోహర" అన్నంతనే మనోభారమిట్టే తీరిపోయినట్లుంటుంది. "హరోహర" అనే ఈ నామోచ్చారణం పసివాళ్ళవలే మహాత్ములు కూడా చేస్తూవుంటారు. భక్త్యావేశంతో "గోవిందా, గోవిందా" అని మనమరచినట్లే పిల్లలూ అరుస్తూవుంటారు.

శివరాత్రి, శ్రీజయంతి ఈ రెండూ మనకు ముఖ్యమైన పండుగలు. ఈ రెండూ ఆరునెలలు ఎడముగా వస్తూవుంటాయి. ఈ రెండు పండుగలకూ రాత్రులు జాగరం కోసం పిల్లలింటింటికి పగటివేళ తిరిగి, "శివరాత్రి మెంబారం" 'శ్రీజయంతి మెంబారం' అంటూ కేకలు వేస్తూ నూనె పోగుచేస్తారు. వాళ్ళ పసిమనస్సులు శివకేశవుల మధ్య భేదం చెయ్యవు. అవ్వయ్యార్ అనే కవయిత్రికూడా ఇలాగే "శివుని మరవకురా! కేశవుని సేవింపరా" అంటూ శివకేశవుల నొక్కరీతిగా భజించినది.

పిల్లలు, భక్తులు ఒక్కచోట చేరినప్పుడు "హరహర మహాదేవ, గోవింద గోవిందా" అంటూ వారి కంఠములు పండుగవేళలందు వినిపిస్తాయి. శివకేశవులనే నామములు, రూపములు వారొకొక్కటే. వారి పెదవులా నామములను ఉచ్ఛరించేటప్పుడు వారి హృదయాలలో మెదలే దేవుడొక్కడే. శ్రీ శంకరులు భజగోవింద స్తోత్రము చేసిరి సంబంధార్ అనే భక్తుడున్నూ హరనామం చేయుమని బోధించారు. మనకిట్లు ఉపదేశించేనాటికి వీరిరువురకూ బాల్యమే.

అజ్ఞానాంధకారానికి ఆవలనుండే నిత్యానందాన్ని పొందాలంటే పార్వతీ సమేతుడైన ఈశ్వరుని ధ్యానించవలసిందని కైవల్యోపనిషత్తు ఉపదేశిస్తున్నది. సోమస్కందమూర్తిలో ఉమామహేశ్వరులేకాక, వారి బిడ్డడైన స్కందుడు కూడా దర్శన మిస్తాడు. స్కందుడు జ్ఞానమూర్తి. ఉమామహేశ్వరులది అభిన్నమైన ఏకమూర్తి. ''దమ్మచ్చి'' అనే పసిపిల్లల తొక్కుపల్కులు ఈ పరమార్థాన్ని బోధిస్తాయి "ఉమ్మచ్చి" అనగా ఉమాశివులు. విష్ణుమూర్తిని కూడ పిల్లలు ఉమ్మచ్చి అనే అంటారు. కనుక శివకేశవభేదం వారికి పట్టదన్నమాట. పిల్లలలో కన్పించే ఈ యేకేశ్వరభావమే మన సకలమత సమత్వానికి తార్కాణం. పిల్లలవలె నిజమయిన ఆస్తికులు మత భేదాలను, ఈశ్వర నామ భేదాలను పట్టించుకోరు.



ఈశ్వరుని గూర్చిన ఈ యద్వయభావం ఇతర మతములందు కన్పించదు. గాంధీజీ 'ఈశ్వరఅల్లా తేరేనాం' అంటూ కీర్తించేవారు భగవంతుణ్ణి, నేటిరోజుల్లో మతసహనం అంటూ వుంటారు. అది కేవలం రాజకీయం. లోకమందిన్ని మతాలు పుట్టని కాలమందే శ్రీకృష్ణభగవానుడు–

యో యో యాంయాం తనుంభక్తః శ్రద్ధయార్చితు మిచ్ఛతి।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహం॥

"ఈశ్వరుని ఎవరెవరు ఏయే రూపాలతో భక్తితో కొలుస్తూ ఉంటారో ఆ రూపమందే వారి భక్తిని నేను దృఢతరం చేస్తాను" అని సెలవిచ్చారు.

ఈ సర్వమతసమత్వమునే బోధిస్తున్న ఈ శ్లోకం వినండి:

యం శైవా స్సముపాసతే శివ ఇతి, బ్రహ్మేతి వేదాంతినః
బౌద్ధా బుద్ధ ఇతి ప్రమాణ పటవః కర్తేతి నైయ్యాయికాః
అర్హన్నిత్యథ జైన శాసనరతాః కర్మేతి మీమాంసకాః
సోయంవో నిదధాతువాంఛిత ఫలం త్రైలోక్యనాథోహరిః॥

"శైవులు శివుడనీ, వేదాంతులు బ్రహ్మమనీ, బౌద్ధులు బుద్ధుడనీ, నైయాయికులు కర్తయని, జైనులు అర్హతుడనీ, మీమాంసకులు కర్మయని కొలుస్తున్న శ్రీహరి మీకు వాంఛితార్థముల నిచ్చుగాక!

శ్రీ మాణిక్యవాచకర్ గూడా ఏమనుచున్నారో చూడండి.

"దైవవాణియు, నాల్గువేదముల సిగయు
ముప్పురిచ్చిన తమిళమ్ము ముని వచస్సు
కమ్మకమ్మని తిరువాచక మ్మివెల్ల
స్వామి పలికిన ఒక్క వాచకము సూవె!

కాబట్టి మతములు మార్చుకొనుటకంటే మన పెద్దల మతాన్ని త్యజించుటలోనే ఎక్కువ అపచారమున్నదని గ్రహించాలి.

పూర్వాచారాన్ని వదలుకొనుట పాతిత్యకారణమన్నారు. కొత్తమతాన్ని అవలంబించవలసిందని కోరడంలో తాత్పర్యమేమైనా వుంటుందేమో ఆలోచించండి. పాతమతాన్ని అంతవరకు అనుసరించినవారంతా అధోగతిపాలవుతారనే కదా? అది అసంభావ్యమని వేరే చెప్పనక్కరలేదు. శైవులను వైష్ణవులుగా, వైష్ణవులను శైవులుగా మారండి అని అనటం కూడా తప్పే. కొత్తమతాలన్నింటికి కర్తయైన పరమేశ్వరుని పట్ల అపచారమే అవుతుంది. సకల మతములవారికీ ఒక్కడే కదా ఈశ్వరుడు.

కొన్ని మతాలకు అది అంటూ వుంటుంది. అనాదియైన మతముకంటే అవి అర్వాచీనములని అంగీకరించాలి. చరిత్ర తెలిసిన మతాలకు ప్రవక్తలుంటారు. వారు పుట్టిన కాలమూ నిర్ణీతమైవున్నది. మన మతం ఎప్పుడు పుట్టిందో తెలియదు. దానికి

కర్తకూడా లేదు. వేదమార్గమని చెప్పబడే మనమతానికి ప్రచారకులంటూ లేకపోయినా, కేవలం తన్మతానుయాయుల అనుష్ఠానాదులవల్లనే అది సజీవంగా ఉంటున్నది. ఇతర మతస్థులకు తన్మతప్రచారం విధాయకం. మన మతం "నాపృష్టఃకస్య చిత్ బ్రూయాత్" 'అడుగనిదే చెప్పవలదని' ఆదేశిస్తున్నది. ప్రచారము కూడదనే యిట్టి నిషేధం ఉన్నప్పటికి అసంఖ్యాకంగా ప్రజలు దీని ననుసరిస్తున్నారు. ఇతరులను తమలో కలుపుకునే అన్యమతాలు పుట్టకపూర్వం మన మతానికింకెంత వ్యాప్తి వుండేదో!

మన మతస్థుల నితరమతాలు తమలో చేర్చుకుంటున్నా మనమతం యితరులను తనలో చేర్చుకోకపోయినా మన మతం ఇంకా బాగానే వుంటున్నది కదా? దీనికి కారణమేమిటని ఆలోచిస్తే, సదనుష్ఠానంవల్లనే మతాలు సజీవంగా ఉంటవేకాని, అన్యులకు ప్రవేశమిచ్చి మతస్థులసంఖ్యను పెంచటంవల్ల కాదని స్పష్టమవుతుంది. కనుక మనమందరం సదనుష్ఠాన పరులం కావలసివుంది. దేవాలయాదులందు మన ధర్మప్రతిష్ఠాపనల పట్ల మనకు శ్రద్ధ సన్నగిల్లడం శోచ్యం, శిథిలావస్థలోవున్న చర్చిగాని, మసీదుగానీ అరుదుగా కనిపిస్తాయి. మరి మన జీర్ణ దేవాలయాలు లెక్కకు మిక్కిలిగా కనిపిస్తున్నవి. పెద్దలు విధించిన ధర్మాలనాచరిస్తూ ఉంటేనే ఏ మతమయినా బ్రతుకుతుంది. ఈ సంసారసముద్ర సంక్షోభములో నిలద్రొక్కుకుని దీన్ని దాటవలెనంటే ఏదోమంత్రమో, జపమో, అనుష్ఠానమో మనకు ఆలంబనముగా వుండాలి. మన మతధర్మములందేకొంచెమో మనం ఆచరిస్తూవుంటే నిషిద్ధమార్గముల పాలబడక, మనం గట్టెక్కి ఇతరులకు కూడా త్రోవచూపిన వాళ్ళమవుతాము. ఎవరిధర్మం వారు ఆచరిస్తూవుంటే లోకానికి శ్రేయం లభిస్తుంది. అట్టి ధర్మాచరణం లోపించుటవల్లనే మనతోపాటు లోకంకూడా పాపపంకంలో దిగబడి వున్నది. సచ్చరిత్రులే లోకానికి ఏడుగడ. లోకమనేది మనకంటే వేరుగాలేదు.

మతములన్నిటినీ ఒక అచ్చున పోయనక్కరలేదు. మనకు మతైక్యం కావాలి గానీ, ఏకమతం గాదు. అనేకత్వమందేకత్వం దుర్లభం గాదు. ఎవరి మతములందు వారు వుండి, స్వధర్మాచరణ చేస్తూ, సకలమతాలకు ప్రభువైన సర్వేశ్వరుణ్ణి ఉపాసించుదుముగాక!

పరమాత్మ స్వరూపాన్ని వర్ణించే శాస్త్రాలను తప్పక చదవండి కాని, నాకు శాస్త్ర పరిజ్ఞానం ఉంది అనే అహంకారాన్ని మాత్రం దరిచేర్చరాదు. పరమాత్మునిలో భక్తి లేక శాస్త్రమనే వలలో తగుల్కొన్న వారికి అనర్థం తప్పదు. కేవలం పుస్తక జ్ఞానంతో 'ఈత' విద్యను తెలుసుకొంటినని ఈతబుర్ర లేకయే నీటిలో దూకడం తప్పు కదా? ఇక ఒక పెద్ద రాతిని కట్టుకొని సాగరంలో దూకేవానికి కలిగే దుర్గతి ఎట్టిదో వేరే చెప్పనక్కరలేదు. **- శ్రీ స్వామి సచ్చిదానందేంద్ర సర్వస్వతీ స్వామి**

పుస్తకములు చదువుటతోనే తృప్తినొందక మస్తకమును గూడా చదువ వలయును. లేనిచో సౌఖ్యము గలుగదు. **- మలయాళ స్వామి**



# వాల్మీకి మహర్షి విరచిత ఆనంద రామాయణము

**పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

బృహదాశ్వ ఇతి ఖ్యాతస్తస్మాజ్జజ్ఞే నృపోత్తమః ।
కువలయాశ్వో నృపతిః దృఢాశ్వస్తత్సుతః స్మృతః ॥ **12**

హర్యశ్వ ఇతి తత్పుత్రో నికుంభస్తత్సుతః స్మృతః ।
బర్హణాశ్వో నికుంభస్య బర్హణాశ్వనృపోత్తమామ్ ॥ **13**

కృతాశ్వోనృపతిః ప్రోక్తః శ్యేనజిత్తత్సుతః స్మృతః ।
యువనాశ్వ శ్యేనజితో యువనాశ్వనృపోత్తమాత్ ॥ **14**

మాంధాతా త్రసద్దస్యుర్హి స ఏవ కథితో భువి ।
పురుకుత్సశ్చ మాంధాతుః పురుకుత్సస్య వై పునః ॥ **15**

త్రసద్దస్యురితి ఖ్యాతోఽనరణ్యశ్యాపి తత్సుతః ।
అనరణ్యస్య హర్యశ్వో హర్యశ్వస్యారుణః సుతః ॥ **16**

త్రిబంధనోఽరుణాజ్జాతస్త్రిబంధనసుతో మహాన్ ।
సత్యవ్రత స్స ఏవాత్ర త్రిశంకురితి వై స్మృతః ॥ **17**

సత్యవ్రతస్య పుత్రోఽభూద్ధరిశ్చంద్రః ప్రతాపవాన్ ।
రోహితస్తత్సుతః ప్రోక్తః స్తస్మాచ్చహరితః స్మృతః ॥ **18**

హరితస్య సుతశ్చంప స్సుదేవశ్చంపదేహజః
సుదేవాద్విజయః ప్రోక్త స్తత్పుత్రో భరుకః స్మృతః ॥ **19**

భరుకస్య వృకః పుత్రో వృకపుత్రస్తు బాహుకః ।
బాహుకాత్సగరో జజ్ఞేఽసమంజ స్సగరాత్మజః ॥ **20**

అసమంజశ్చ పుత్రోభూఽదంశుమానితి నామతః ।
తస్య పుత్రో దిలీపస్తు దిలీపాచ్చ భగీరథః ॥ **21**

భగీరథాచ్ఛ్రుతో జాతః శ్రుతాన్నాభః ప్రకీర్త్యతే ।
నాభస్య సింధుద్వీపశ్చ హ్యయుతాయుశ్చ తత్సుతః ॥ **22**

ఋతుపర్ణస్త్వయుతాయో స్సుదాసస్తస్య కీర్త్యతే ।
మిత్రసహ స్స ఏవాత్ర కల్మాషాంఘ్రి స్స ఏవ హి ॥ **23**

**సుదాసస్యాశ్మకః పుత్రో మూలకోఽశ్మకదేహజః ।**
**స ఏవ నారీకవచో మూలకస్య సుతో మహాన్ ॥ 24**

**నామ్నా దశరథః ప్రోక్త స్తస్య పుత్రః ప్రతాపవాన్ ।**
**నామ్నాత్వైడవిడః ప్రోక్త స్తస్య విశ్వసహః స్మృతః ॥ 25**

శావస్తుని కుమారుడు బృహదాశ్వుడు. బృహదాశ్వునికి జన్మించినవాడు కువలయాశ్వుడు. వీనికి జన్మించినవాడు దృఢాశ్వుడు. (12)వీని సుతుడు హర్యశ్వుడు. హర్యశ్వునికి పుట్టినవాడు నికుంభుడు. ఇతనిసంతానం బర్హణాశ్వుడు. (13) ఇతనికి కృతాశ్వుడు పుట్టాడు. కృతాశ్వుని సంతానం శ్యేనజిత్తు. వీనికి కలిగినవాడు యువనాశ్వుడు. (14) ఇతనికుమారుడే త్రసదస్యుడు అనబడు మాంధాత మహారాజు. ఇతని సంతానం పురుకుత్సుడు. (15)పురుకుత్సుని తనయుడు త్రసదస్యుడు (ఈపేరు మళ్ళీపెట్టడం జరిగింది.) త్రసదస్యుని పుత్రుడు అనరణ్యుడు. వీనికి కలిగినవాడు హర్యశ్వుడు. ఇతని కొడుకు అరుణుడు. (16) అరుణుని పుత్రుడు త్రిబంధనుడు. ఈ త్రిబంధనుని పుత్రుడే సత్యవ్రతుడనబడు త్రిశంకుమహారాజు. (17)ఇతని కుమారుడు హరిశ్చంద్రుడు. ఇతని పుత్రుడు రోహితుడు. రోహిత సుతుడు హరితుడు. (18) హరితునికి కలిగినవాడు చంపుడు. చంపుని కుమారుడు సుదేవుడు. ఇతని కుమారుడు విజయుడు. విజయుని సుతుడు భరుకుడు. (19) ఇతనికి కలిగినవాడు వృకుడు. వృకపుత్రుడు బాహుకుడు. బాహుకుని కుమారుడు సగర చక్రవర్తి. సగరపుత్రుడు అసమంజసుడు. (20) ఇతనికి అంశుమంతుడు జన్మించాడు. ఇతని కుమారుడు దిలీపచక్రవర్తి. దిలీపుని కుమారుడు భగీరథ మహారాజు. (21)

భగీరథుని పుత్రుడు శ్రుతుడు. శ్రుత పుత్రుడు నాభుడు. నాభచక్రవర్తి కుమారుడు సింధుద్వీపుడు. ఇతని కుమారుడు అయుతాయు. (22) ఇతనికి జన్మించిన వాడు ఋతుపర్ణుడు. ఇతనికుమారుడగు సుదాసుడే, మిత్రసహుడుగాను కల్మాష పాదుడుగాను పిలువబడ్డాడు. (23) ఈ సుదాసుని కుమారుడగు అశ్మకసుతుడే నారీకవచుడనబడు మూలకుడు. (24) మూలకుని తనయుడు దశరథుడు. ఇతని సుతుడు ఐడవికుడు. ఇతని తనయుడు విశ్వసహుడు. (25)

గ్రంథాలు పఠించండి! ప్రసంగాలు వినండి! ప్రవచనాలు కావించండి! కాని లోకంలో అనుభవమొక్కటే గురువని చెప్పబడింది. అనుభవమే మనకనులు తెరువగలదు. శుభకరమైన లక్ష్యంవైపు మనలను అనుభవమే నడిపించుగాక!

**– శ్రీ స్వామి వివేకానంద**

శాస్త్ర విచారముతో జీవితముల గడుపువారు చాలమంది కలరు. కాని విజ్ఞానము కలిగినవారఋదు. ఆ భగవత్ప్రేమ విషయమున నొక్కపదమును గ్రహించినను ధన్యుడగును. **– సంత్ కబీర్‌దాసు**



# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

**(గత సంచిక తరువాయి)**

## గురుపూజ

**ఆనందముతో శిష్యుని తనవానిగా స్వీకరించిన జ్ఞానగురువు నడయాడుచున్న పరమశివుడు. శిష్యుడు ఆ జ్ఞానగురువుకు మనోవాక్కాయ కర్మల ద్వారా, ఏ ఒక్కలోటు రానీయక, సకల పరిచర్యలొనర్చి, పూజించుచుండవచ్చును గాక! ఆయనను అతడు ఒనర్చవలసిన పూర్ణమైన పూజఒకటి మిగిలియున్నది. తన ఆత్మకు ఆత్మయై వెలుగొందుచున్న గురువుకంటే తాను భిన్నమైన తత్త్వముగా ఉన్నాడనెడి భావమును నశింపచేసికొని, నీటిలో మంచుకరిగిపోయిన రీతిగా గురువుయొక్క పరాస్వరూపము నందు తన జీవత్వమును విలీనము గావించి, ప్రేమమాత్రముగా ఆయనలో ఐక్యము కావలయును.**

శిష్యుడు గురువుకు మనోవాక్కాయకర్మలతో సేవ చేస్తూ, తన మనస్సును పరిపూర్ణంగా గురువు ఆత్మలో లయం చేయడమే అనే భావన ఉండాలి. గురువు సాక్షాత్తు భగవంతుడే మానవరూపం ధరించివచ్చిన శివుడే గురువు అనే భావనలో, నిన్ను నీవు నీ జీవత్వాన్ని పోగొట్టుకొని ఆయనలోని శివత్వములో లీనం చెయ్యి. ఇది గురువుకు సంపూర్ణ శరణాగతి ద్వారానే వస్తుంది. ఎప్పుడూ గురువుకు బాహ్య పూజ చేయడం సాధ్యం కాదు. కావున నిరంతరము గురువును స్మరించడమే, తన మనస్సును సంపూర్ణంగా గురువుయొక్క పాదములకు శరణాగతి చెయ్యడమే, అంకితము చేయడమే నైవేద్యం. ఇదే అసలయిన పూజ.

**పనికిమాలిన భేదభావనయే భ్రాంతి. ఆ భ్రాంతి గోచరించుటకు కారణము అవిద్యాహంత. భేదభావన కారణముగా, గురువు యొక్కయు, శివునియొక్కయు, సత్తత్వమగు ఆత్మ స్వరూపమును, ఆ అద్వయపరబ్రహ్మమును గురుశిష్యులు, జీవేశ్వరులు ఇత్యాదిగా విభజించి నీవు చూచుచున్నావు. పూర్తి ఎఱుకతో యోగ్యమయిన రీతిలో నీవు వారికి (శివునికి, గురువుకు) చేయు నమస్కారమునకు నిజమయిన అర్థము మౌనమే. ఆ స్థితిలో అవిద్యాహంత, హృదయములో ఇసుమంతయు తలెత్తదు.**

వేదాంతం మనకు కనపడేదంతా కూడ పరమాత్మ అని చెబుతుంది. మనకు ఈ విషయం తేలికగా అర్థంకాదు. ఈ జగత్తు, ఈశ్వరుడు, జీవుడు ఆత్మస్వరూపమే అని వేదాంతం చెబుతుంది. ఈ భేదం అహంకారం వల్ల కలుగుతుంది. సత్వరజో తమో గుణాలతో భేదభావం కలిగి జీవుడు జీవనం సాగిస్తుంటాడు. అహంత

(అహంకారం) వలన గురువు, నీవు, భగవంతుడు ఒక్కటేనన్న విషయం తెలియడం లేదు. గురువును ఆశ్రయించిన తరువాత కూడా, గురువు వేరు, నేను వేరు అనే భావన పోవడం అంత తేలికయిన విషయం కాదు. పూర్తి ఎఱుకతో చక్కనయిన రీతిలో సాధనచేస్తే, అహంకారం నశించి, పరిపూర్ణమయిన మౌనస్థితి ఏర్పడుతుంది. రాగద్వేషాలు, అహంకార మమకారాలు, అరిషడ్వర్గాలు బలంగా మనస్సులో తిష్ట వేసుకొనిపోవడం వల్ల ఎంత సాధన చేస్తున్నా మనకు ఒక్కక్షణమయినా ఆలోచనా ప్రవాహం ఆగదు. సాధన చేయగా చేయగా అహంకారం నశించి త్రిగుణాతీత స్థితి వస్తుంది. మూడు అవస్థలను దాటి తురీయస్థితి వస్తుంది. అప్పుడు మౌనమవుతుంది. అదే గురువుకు చేసే నమస్కారం. పరిపూర్ణమయిన మౌనస్థితియే మనము గురువుకు చేసే నమస్కారము.

**జ్ఞానగురువు సాక్షాత్తుగా ఈశ్వరుడే. ఈ జ్ఞానగురుని చైతన్యాగ్ని జ్వాలలో– 'నేను' అనుచు తన్నుతాను ప్రకటించుకొనెడి శిష్యచైతన్యము దగ్ధముకాగా, వాసనా విముక్తమౌనము ఉప్పొంగి, ఆత్మనిష్ఠ సిద్ధించును. జ్ఞానగురునికి చేయు నిజమయిన పూజ ఆ ఆత్మనిష్ఠయే, ఆ మౌననిష్ఠయే అని తెలిసికొనుము.**

జ్ఞానగురువు సాక్షాత్తూ ఈశ్వరుడే అన్న భావనతో మనము సాధన చేస్తూ ఉంటే, ఆ జ్ఞానగురువు యొక్క అనుగ్రహం చేత మనలో అన్నివాసనలు నశించి పోతాయి. గురువుచేసే జ్ఞానబోధను అగ్నితో పోల్చారు. అది మన అహంకారాన్ని దగ్ధం చేస్తుంది. మనకు పరిపూర్ణమయిన మౌనం సిద్ధిస్తుంది. ఆత్మ అనుభవానికి వస్తుంది. ఆత్మనిష్ఠలో ఉండడమే గురువుకు చేసే పూజ. ఆత్మానుభవం పొంది మౌననిష్ఠలో ఉండడమే గురువుకు చేసే నిజమయిన పూజ.

**మిథ్యాభావన అయిన 'శిష్య–చైతన్యము'ను పూర్తిగా నశింపజేసికొనుటయే ఉత్తమశిష్యులు గురువుకు చేయు నిజమైన పూజ. 'గురు–చైతన్య' స్థితియందు దృఢనిష్ఠ కలిగియున్న ప్పుడు ఇట్టి పూర్ణానుభవము సిద్ధించును. పూర్ణత్వముయొక్క అనుభవము కలుగవలయునన్నచో, 'శిష్యునిగా స్వీకరించపబడిన ఈ "నేను" ఎవడు?" అనుచు హృదయాభిముఖముగా విచారణ చేయవలసియుండును.**

గురువుచెప్పే భోదలమీద నీకు పరిపూర్ణమయిన విశ్వాసం, దృఢనిష్ఠ కలిగి నపుడు నీ సాధన ఫలిస్తుంది. పరిపక్వత కలిగి మౌనము అనుభవం లోనికి వస్తుంది. నేను, ఆడ, మొగ, నేను శిష్యుణ్ణి, నేను సాధనలో పరిపూర్ణుడనయ్యాను అనుభావనలు అహంకారమే.

**సాధన ఎలా చేయాలి:–** సుఖాసనంలో కూర్చొని, వెన్నుపూస, మెడ, తలని నిటారుగా ఉంచి, కళ్ళుమూసుకొని మనమనస్సును ఛాతీకి కుడివైపున ఉంచి, ఒక్కసారి 'నేను ఎవడను' అని ప్రశ్న వేసుకోవాలి. ప్రశ్న వేసుకుంటే ఒక్కక్షణమయినా



ఆలోచన ఆగుతుంది. తరువాత ఈ ఆలోచన ఎక్కడ పుడుతుందో అని గమనించడము. ఈ రెండు పనులూ చేయాలి. ఆలోచన దొంగలాంటిది. కాపలా ఉన్నచోటుకు దొంగలు రానట్టు, ఆలోచన ఎక్కడ పుడుతుందో గమనిస్తూ ఉంటే మళ్ళీ ఆలోచన వెంటనేరాదు. ఇది ప్రాథమిక దశ. నేను ఎవడను అనేది మంత్రం కాదు. ఆలోచనలను ఆపడానికి ఇది ఒక ఉపాయము. ఆలోచనలను గమనించమని భగవాన్ చెప్పలేదు. ఆలోచన ఎక్కడ పుడుతుందో గమనించమన్నారు. ఆ పుట్టేచోటును నశింపచేయాలి. మొదట ఇబ్బందిగా ఉన్నా చేయగా చేయగా అందులోని మెళకువలు తెలుస్తాయి. ఒక పదిపదిహేనురోజులు ఇలా చేస్తే మీకు ఆలోచనలు రావడం తగ్గుతుంది. ఆలోచన ఒక్కక్షణం ఆగినా మీకు ప్రశాంతత లభిస్తుంది. దీనిని మీరు శ్రద్ధగా గమనించాలి. అదే మీ అసలు ఆత్మ. ఆలోచనలు పుట్టే చోటే ఆత్మ. కనుక ఆత్మ ఎక్కడ ఉందోకూడా తెలుస్తుంది. ఆత్మ సర్వవ్యాపకమయినప్పటికి, ఏకాగ్ర సాధనతో, నేనెవడను అనే ప్రశ్న అవసరం లేకుండానే ఆ స్థితికి వెళ్ళడం జరుగుతుంది. సాధనలో ఆలోచనల మధ్య దూరం పెరుగుతుంది. ఆలోచనారహితస్థితి వస్తుంది. ఆత్మ అనుభవం అవుతుంది. ఆత్మ ఎప్పుడూ ఉంటుంది. కాని ఆలోచనల మరుగున ఉంటుంది. ఆత్మను తెలుసుకోవడానికి సాధనల చాలా ఓపికగా, ఓర్పుగా, పట్టుదలతో, శ్రద్ధగా, గురువుమాటల మీద విశ్వాసంతో చేయాలి. గురువు మార్గం మాత్రమే చూపిస్తారు. సాధన చేయవలసినది మనమే. ఇది సాధన చేయగా చేయగా పరిపూర్ణమైన మౌనస్థితి వస్తుంది. ఈ పరిపూర్ణమయిన మౌనస్థితియే భగవంతునికి, గురువుకు చేసే నమస్కారము. అసలయిన పూజ.

'నేను శిష్యుడను, ఆయన గురువు' అనుకునేది అహం మనస్సు. మనస్సుకు నేను శరీరమనే భావన ఉంది. గురువు కూడా ఒక శరీరముగానే మనస్సు చూస్తుంది. గురువు ఎంతభోద చేసినా ఈ భావన అంత తేలికగా పోదు. సాధన చేయగా, ఆత్మానుభవం కలిగినా అది దృఢంగా నిలవాలి. లోపల వాసనలు దృఢంగా బలంగా ఉంటాయి. ఒకొక్కసారి వాసనలు పూర్తిగా పోకపోయినా ఆత్మానుభవము కలుగవచ్చు. ఈ భావనలన్నీ శిష్యుని మనస్సులోనే ఉంటాయని భగవాన్ అంటున్నారు. గురువుకు ఉండవు. గురువుకు అహంభావం నశించిపోయి, తాను సర్వవ్యాపకమయిన ఆత్మను, నాకు భిన్నంగా ఏమీలేదు అనుకుంటారు. శిష్యుడనని అనుకునేవారు నేను ఎవడనని విచారణ చేయాలి. ఈ ఆలోచన ఎక్కడనుండి పుడుతుందో గ్రహించి నశింపచేయాలి. శిష్యుడు ఆత్మానుభవం పొందడమే నిజమైన గురుపూజ. ఆ ఆత్మనిష్ఠ స్థితినుండి దిగజారకుండా ఉండడమే తనకు నిజమైన గురుదక్షిణ అని భగవాన్ అన్నారు. ఎటువంటి ఆకర్షణలకు లొంగకుండా నిరంతరము ఆత్మనిష్ఠ సాధనలో కొనసాగడమే తనకు ఇచ్చే గురుదక్షిణ అని భగవాన్ అన్నారు.

**(సశేషం)**

# నిర్గుణ మానసపూజ

-ఆదిశంకరాచార్య విరచితం

**ఆరాధయామి మణిసన్నిభ మాత్మలిఙ్గం**
**మాయాపురీ హృదయపఙ్కజ సన్నివిష్టమ్ ।**
**శ్రద్ధానదీ విమలచిత్త జలాభిషేకైః**
**నిత్యం సమాధికుసుమై ర పునర్భవాయ ॥ 1**

(గురువు) మాయాపురి యనదగు హృదయ పద్మమున ధవళమణి కాంతులను వెదచల్లుచూ ఉన్న నాలోని ఆత్మను నేను శ్రద్ధ అనే నిర్మల జలముతో సమానమైన చిత్తముతో నభిషేకించుచు, సమాధి అనే పుష్పములతో సర్వదా అర్చించుచున్నాను. నాకు పునర్జన్మము లేకుండుగాక.

**అయమేకోవశిష్టోస్మీత్యేవ మావాహయేచ్ఛివమ్ ।**
**ఆసనం కల్పయేత్ పశ్చాత్ స్వప్రతిష్ఠాత్మచిన్తనమ్ ॥ 2**

నేనొక్కడనే మిగిలియున్నాను అను చింతయే ఆవాహనము. స్వస్వరూపము నందు నిలబడి ఉండుటయే ఆసనము. ఇట్లు శివునికు (ఆత్మకు) ఆవాహన–అర్చనలతో పూజింపుము.

**పుణ్యాపాపరజఃసఙ్గో మమ నా స్తీతివేదనమ్ ।**
**పాద్యం సమర్పయేద్ విద్వాన్ సర్వకల్మషనాశనమ్ ॥ 3**

నాకు పుణ్యాపాప సంబంధమగు మాలిన్యము లేదు – అని జ్ఞానమునే కల్మష నాశనమగు పాద్యముగ భావించి అర్చించుము.

**అనాదికల్పవిధృత మూలాజ్ఞానజలాఞ్జలిమ్ ।**
**విసృజేదాత్మలిఙ్గస్య తదేవార్ఘ్య సమర్పణమ్ ॥ 4**

ఈ ఆత్మ లింగమున కర్ఘ్యమేమనగా, అనాదికాలము నుండి సంచితమైన మూలాజ్ఞానమును జలాంజలిగ సమర్పించుటయే.

**బ్రహ్మానన్దాబ్ధి కల్లోలకణకోట్యంశ లేశకమ్ ।**
**పిబ న్తీన్ద్రాయ ఇతి ధ్యానమాచమనం మతమ్ ॥ 5**

బ్రహ్మానంద తరంగకణము యొక్క కోట్యంశబిందువునే ఇంద్రాదులు పానమొనర్చుచున్నారను భావనయే ఆచమనము.

**బ్రహ్మానన్దజలే లోకాః సర్వే పరిప్లుతాః ।**
**అచ్ఛేద్యోయమితి ధ్యానమభిషేచన మాత్మనః 6**

బ్రహ్మానంద జలములో లోకములన్నియును నిండియున్నవి. ఇది అచ్ఛేద్యము అను భావనయే ఆత్మాభిషేకము.



**నిరావరణ చైతన్యం ప్రకాశోస్మీతి చిన్తనమ్ ।**
**ఆత్మలిఙ్గస్య సద్ వస్త్ర మిత్యేవం చిన్తయేన్మునిః 7**

'నేను ఆవరణ రహితమైన చైతన్య స్వరూపుడను. ప్రకాశ స్వరూపుడను, అను చింతయే ఈ ఆత్మలింగమున కర్పింపదగిన చక్కని వస్త్రము. ఈ రీతిగ జ్ఞానియగువాడు ధ్యానించుచుండవలెను.

**త్రిగుణాత్మా శేషలోకమాలికా సూత్రమస్మ్యహమ్ ।**
**ఇతి నిశ్చయమేవాత్ర హ్యుపవీతం పరం మతమ్ ॥ 8**

ఇక ఉపవీత మెట్టిదనిన, సత్త్వరజస్తమో గుణయుతములగు లోకములనే మాలలోని సూత్రమును నేనే, అను నిశ్చయము.

**అనేక వాసనామిశ్ర ప్రపఞ్చోయం ధృతో మయా ।**
**నాన్యేనేత్యనుసన్ధానమాత్మనశ్చన్దనం భవేత్ ॥ 9**

పెక్కువాసనలతో (సంస్కారములతో) నిండిన ఈ ప్రపంచమును నేనే ధరించి యున్నాను. ఇతరులు కాదు, అను అనుసంధానమే చందనము.

**రజః సత్త్వతమోవృత్తి త్యాగరూపై స్తిలాక్షతైః**
**ఆత్మలింగం యజేన్నిత్యం జీవన్ముక్తి ప్రసిద్ధయే ॥ 10**

త్రిగుణ వృత్తిత్యాగమను తిలలతోడను (గుణత్రయము ప్రవర్తించు వ్యవహార త్యాగమే తిలలు) అక్షతలతోడను జీవన్ముక్తిని బొందు నిమిత్తము లౌకిక వ్యవహారము లకు దూరముగా ఉంటే అదే అర్చన.

**ఈశ్వరో గురురాత్మేతి భేదత్రయవివర్జితైః ।**
**బిల్వపత్రై రద్వితీయై రాత్మలిఙ్గం యజే చ్ఛివమ్ 11**

ఈశ్వరుడు, గురువు, ఆత్మ – ఈ ముగ్గురకును భేదము లేదను భావనయే అద్వితీయమగు బిల్వపత్రము కాగా, దానితో శివస్వరూపమగు ఆత్మలింగమును పూజింపనగును.

**సమస్తవాసనాత్యాగం ధూపం తస్య విచిన్తయేత్ ।**
**జ్యోతిర్మయాత్మ విజ్ఞానం దీపం సన్దర్శయేద్ బుధః 12**

బ్రహ్మజ్ఞానము పొందినవాడు సమస్త వాసనాత్యాగమునే ధూపముగ భావింప నగును. జ్యోతిర్మయిమగు ఆత్మవిజ్ఞానమును దీపముగా చూపించనగును.

**నైవేద్య మాత్మలిఙ్గస్య బ్రహ్మాండాఖ్యం మహోదనమ్ ।**
**పిబానన్దరసం స్వాదు మృత్యురస్యోపసేచనమ్ ॥ 13**

బ్రహ్మాండమే అన్నమై, ఈ ఆత్మలింగమునకు మహానైవేద్యము అగుచున్నది. మృత్యువే ఆత్మకు ఆధరువు – ఇట్టి చక్కటి బ్రహ్మానందరసమును త్రాగుము.

**అజ్ఞానో చ్ఛిష్టహస్తస్య క్షాలనం జ్ఞానవారిణా ।**
**విశుద్ధస్యాత్మలిఙ్గస్య హ స్తప్రక్షాలనం భవేత్ ॥ 14**

అజ్ఞానమే ఎంగిలి. ఇట్టి ఎంగిలతో కూడిన చేతిని, జ్ఞానమను నీటితో కడుగుము. విశుద్ధమగు ఆత్మలింగమునకు ఇదియే హస్తప్రక్షాళనము.

**రాగాదిగుణశూన్యస్య శివస్య పరమాత్మనః ।**
**సరాగవిషయాభ్యాసత్యాగ స్తామ్బూలచర్వణమ్ ॥ 15**

విషయాభ్యాసమునందలి అనురాగమును త్యజించుటయే రాగాది రహితుడును, శివస్వరూపుడును అగు పరమాత్మకు తాంబూలము అర్పించుట.

**అజ్ఞానధ్వాన్త విధ్వంస ప్రచణ్డమతిభాస్కరమ్**
**ఆత్మనో బ్రహ్మతా జ్ఞానం నీరాజన మిహాత్మనః ॥ 16**

అజ్ఞానాంధకారమును వినాశమొనర్చు సూర్యుడనతగిన ఏ బుద్ధికలదో, ఏది ఆత్మను బ్రహ్మముగ గ్రహించుచున్నదో, అదియే నీరాజనము.

**వివిధ బ్రహ్మసందృష్టి ర్మాలికాభి రలఙ్కృతమ్ ।**
**పూర్ణానందాత్మ తాదృష్టిం పుష్పాంజలి మనుస్మరేత్ ॥ 17**

ఈ ఆత్మలింగమునకు, వివిధ వస్తువులలో బ్రహ్మమును దర్శించు ప్రక్రియనే మాలగానొనర్చిఅలంకరింపుము. పూర్ణానంద స్వరూపమగు ఆత్మదర్శనమే పుష్పాంజలి.

**పరిభ్రమన్తి బ్రహ్మాణ్డసహస్రాణి మయీశ్వరే ।**
**కూటస్థాచలరూపోఽహమితి ధ్యానం ప్రదక్షిణమ్ ॥ 18**

ఈశ్వరుడనగు నాయందు అనంతకోటి బ్రహ్మాండములు పరిభ్రమించుచున్నవి. నేను కూటస్థుడను. అచలుడను అను ధ్యానమే ప్రదక్షిణము.

**విశ్వవన్ద్యోఽహమేవాస్మి నాస్తి వన్ద్యో మదన్యతః ।**
**ఇత్యాలోచనమేవాత్ర స్వాత్మలిఙ్గస్య వన్దనమ్ ॥ 19**

నేను జగత్పూజ్యుడను, నాకంటె వందనీయులెవ్వరును లేరు. అను చింతయే ఆత్మలింగ వందనము.

**ఆత్మనః సత్క్రియా ప్రోక్తౌకర్తవ్యాభావభావనా ।**
**నామరూపవ్యతీతాత్మచిన్తనం నామ కీర్తనమ్ ॥ 20**

ఆత్మకెట్టి కర్తవ్యమును లేదు. అను చింతయే, సత్కారము. నామ రూప రహితమగు ఆత్మచింతనయే నామకీర్తనము.

**శ్రవణం తస్య దేవస్య శ్రోతవ్యాభావచిన్తనమ్**
**మనన న్స్వాత్మలిఙ్గస్య మన్తవ్యాభావచిన్తనమ్ ॥ 21**

ఆత్మభిన్నయగు వినదగిన వస్తువు లేదను ధ్యానమే, ఈ పూజాంగమగు శ్రవణము. అన్యమగు మనన వస్తువు లేదను చింతనయే, ఆత్మలింగమననము.



**ధ్యాతవ్యాభావ విజ్ఞానం నిదిధ్యాసన మాత్మనః**
**సమస్త భ్రాన్తివిక్షేపరాహిత్యేనాత్మ నిష్ఠతా ॥ 22**

జగద్-భ్రాంతి యను మనశ్చాంచల్యము లేకుండ ఆత్మనిష్ఠ యందుండి ధ్యానయోగ్యమగు వస్తువు మరియొక్కటి లేదను జ్ఞానమే నిధిధ్యాసనము.

**సమాధిరాత్మనో నామ నాన్యచ్చిత్తస్య విభ్రమః**
**తత్రైవ బ్రహ్మణి సదా చిత్తవిశ్రాన్తి రిష్యతే ॥ 23**

బ్రహ్మమున చిత్తము సదా ఏమరపాటు లేక ఉండుటయే సమాధి యని చెప్పబడుచున్నది.

**ఏవం వేదా న్తకల్పోక్త స్వాత్మలిఙ్గ ప్రపూజనమ్ ।**
**కుర్వ న్నా మరణం వాఽపి క్షణం వా సుసమాహితః ॥ 24**

ఈ రీతిగ వేదాన్త మందు ఆత్మలింగపూజ విధింపబడినది. మరణ పర్యన్తము గాని లేక ఒక్కక్షణముగాని ఈ పూజ నొనర్చవలెను.

**సర్వదుర్వాసనాజాలం పదపాంసుమివ త్యజేత్ ।**
**విధూయాజ్ఞానదుఃఖౌఘం మోక్షానన్దం సమశ్నుతే ॥ 25**

అట్లు అర్చించిన యెడల దుర్వాసనలన్నియును పాదధూళివలె పరిత్యక్తము లగును. అజ్ఞానం వలన కలిగిన దుఃఖ సమూహము నశించును. మోక్షానందము లభించును.

**శ్రీశంకరకృత నిర్గుణమానసపూజ సమాప్తము**

---

**ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము**

"దివ్య జీవన సంఘము"నకు చెందిన 'యోగవేదాంత ఫారెస్టు అకాడమి" 98వ యోగవేదాంత తరగతులను 02-08-2023 నుండి 30-09-2023వ తేదీ వరకు రెండు మాసములు నిర్వహింపనున్నది. ఈ తరగతులు ఋషికేష్, శ్రీ శివానందాశ్రమము, ప్రాంగణమునందు జరుగును. 20 నుండి 65సంవత్సరముల మధ్యగల ఆరోగ్యవంతులైన, భారతీయపురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహించబడును. ఈ తరగతులు ఆంగ్లభాష యందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్లభాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసియుండవలెను. శిక్షణ, వసతి, భోజనము ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరితేది 30-06-2023 ఈ క్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికను పొందవచ్చును.

w.w.w.sivanandaonline.org WEBSITE నుండి కూడా పొందవచ్చును.
e-mail yvfacademy@gmail.com
Address : The Registrar,
The Yoga, Vedanta Forest Acadamy.
The Divine Life Sociecy,
P.O. SHIVANANDA NAGAR - 249992
Dr. Tehri Garwal, Uttarkhand.

ఇట్లు
Registrar. Yoga Vedanta
Forest Academy.

# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.యస్.సుబ్రహ్మణ్యశాస్త్రి

## VIII అధ్యాయము

## అథాంగపూజా

### 14. తాంబూలమ్

శ్లో॥ **పూగీఫలం మహ ద్దివ్యం నాగవల్లీదళైర్యుతమ్ ।**
**కర్పూరైలాసమాయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్ ॥**

శ్లో॥ **పూగీఫలైశ్చ కర్పూరై ర్నాగవల్లీ దళై ర్యుతమ్ ।**
**తాంబూలం గృహ్యతాం దేవి ! వరదా భవ శోభనే !**

శ్రీ తులసీదేవ్యై నమః తాంబూలం సమర్పయామి.
తాంబూలచర్వణానంతరం శుద్ధఆచమనీయం సమర్పయామి.

శ్లో॥ **వ్రత పూర్తింమహాకాళి ! దివ్యస్ఫూర్తిం హరిప్రియే !**
**ప్రాప్తుకామ స్త్వహం నౌమి సౌవర్ణం పుష్ప మర్పయే ॥**

శ్రీ తులసీదేవ్యై నమః సువర్ణపుష్పం సమర్పయామి.

### 15. నీరాజనమ్

శ్లో॥ **నీరాజయామి సతతం హరివల్లభేఽద్య ।**
**కర్పూరవర్తిభి రలం సుఖదాయకే త్వామ్ ॥**
**పాదౌ భజా మ్యవిరతం తవ దేవి! మాయే ।**
**వంశాయ సౌఖ్య మపి దేహి బలంచ పూర్ణమ్ ॥**

శ్లో॥ **పద్మనాభప్రియే నిత్యం పద్మసంభవ పూజితే ।**
**పదపత్ర విశాలాక్షి! వరదా భవ మే సదా ॥**

శ్రీ తులసీదేవ్యై నమః నీరాజనం సమర్పయామి.
(నీరాజనానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి.)

### మంత్రపుష్పము

ధాతా పురస్తా ద్య ముదాజహార ............ మొదలగునవి చదివి,

శ్లో॥ **లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీం**
**దాసీభూతసమస్తదేవవనితాం లోకైక దీపాంకురామ్ ॥**
**శ్రీమన్మందకటాక్షలబ్ధవిభవబ్రహేంద్రగంగాధరాం**
**త్వాం త్రైలోక్యకుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియామ్॥**



శ్లో॥ **శుద్ధలక్ష్మీ ర్మోక్షలక్ష్మీ ర్జయలక్ష్మీ స్సరస్వతి ।**
**శ్రీలక్ష్మీ ర్వరలక్ష్మీ శ్చ ప్రసన్నా మమ సర్వదా ॥**

శ్లో॥ **వరాంకుశౌ పాశ మభీతిముద్రాం**
**కరై ర్వహంతీం కమలాసనస్థామ్ ।**
**బాలాఽర్కకోటిప్రతిమాం త్రిణేత్రాం**
**భజే ఽహ మంబాం జగదీశ్వరీం తామ్ ॥**

శ్లో॥ **సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధకే ।**
**శరణ్యే త్ర్యంబకే దేవి ! నారాయణి నమో స్తుఽతే**

శ్లో॥ **పద్మనాభప్రియే ! నిత్యం పద్మోద్భవసమర్పితే ।**
**పద్మపత్ర విశాలాక్షి! వరదా భవ శోభనే॥**

శ్లో॥ **ఉపచారేషు య న్న్యూనం పూజాకాలేచ య త్కృతమ్ ।**
**సర్వం సంపూర్ణతాం యాతి మంత్రపుష్పప్రదానతః**

శ్రీతులసీదేవ్యై నమః పాదయోః దివ్యసువర్ణమంత్రపుష్పం సమర్పయామి.

శ్లో॥ **హిరణ్యగర్భగర్భస్థం హేమబీజం విభావసోః ।**
**అనంతపుణ్యఫలద మత శ్శాంతిం ప్రయచ్ఛ మే ॥**

అని దక్షిణతోగూడిన పుష్పాక్షతలను సమర్పింపవలెను.

### 16. ఆత్మప్రదక్షిణ నమస్కారములు

శ్లో॥ **యాని కానిచ పాపాని జన్మాంతరకృతానిచ ।**
**తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే ॥**

శ్లో॥ **నమస్తే గార్హ పత్యాయ నమస్తే దక్షిణాగ్నయే ।**
**నమ ఆహవనీయాయ తులస్యై తే నమో నమః ॥**

శ్లో॥ **నమో నమో జగద్ధాత్రై జగదాద్యై నమోఽస్తు తే ।**
**నమో నమో జగద్భాత్ర్యై నమస్తే పరమేశ్వరి ॥**

శ్లో॥ **నమస్తే దేవి! కళ్యాణి ! నమ స్తులసి ! సర్వదే!**
**నమో వేదమయే ! దేవి! నమస్తే హరివల్లభే॥**

శ్లో॥ **నమస్కరోమి దేవి త్వాం విష్ణువక్షఃస్థలే స్థితామ్ ।**
**ప్రణతార్తిహరే నిత్యం సుఖష్టఫలదా భవ ॥**

శ్రీ తులసీదేవ్యై నమః ప్రదక్షిణ నమస్కారాన్సమర్పయామి.

**దేవ్యై ర్యా పూజ్యతే నిత్యం దేవా న్పూజయతే చ యా।**
**సా దేవీ తులసీ రమ్యా మంగళాని ప్రయచ్ఛతు ॥**

శ్రీ తులసీదేవై నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి. (అంటూ

తులసికోట చుట్టును యథాశక్తిగా కనీసము మూడుసార్లు ప్రదక్షిణములు చేయుట (శ్రేయోదాయకము) 108 సార్లు చేసిన అధికఫలము కలుగును.

**శ్లో॥ య న్మూలే సర్వతీర్థాని య న్మధ్యే సర్వదేవతాః ।**
**య దగ్రే సర్వవేదాశ్చ తాం తులసీం నమా మ్యహమ్ ॥**
**తుల స్యమృత జన్మాసి సదా త్వం కేశవప్రియా**
**కేశవార్చన యోగ్యా మే వరదా భవ సర్వదా ॥**
**తులసీమూలగం తోయం తులసీ మూలమృత్తికా।**
**తులసీదళసంస్పర్శం సర్వపాపౌఘనుత్తయే ॥**

శ్రీ తులసీదేవ్యై నమః నమస్కారాణి సమర్పయామి.

### ఫలసమర్పణమ్

**శ్లో॥ ఇదం ఫలం మయా దేవి! స్థాపితం పురత స్తవ ।**
**తేన మే సఫలాఽవాప్తిః భవే జ్జన్మని జన్మని ॥**

శ్రీ తులసీదేవ్యై నమః ఫలం సమర్పయామి.

### అర్ఘ్యప్రదానమ్

**శ్లో॥ గంధ ప్రసూన సంయుక్తం ఫలముద్రాదిశోభితమ్ ।**
**అర్ఘ్యం దదామి తులసి ! తవ ప్రీత్యై నమో నమః ॥**
**శ్లో॥ శియఃశ్రియై శ్రియావాసే! నిత్యం శ్రీధరసత్కృతే ।**
**భక్త్యా దత్తం మయా దేవి! అర్ఘ్యం గృహ్ణ నమోఽస్తుతే**

శ్రీ తులసీదేవ్యై నమః అర్ఘ్యత్రయం సమర్పయామి.
(అంటూ మూడుసార్లు అర్ఘ్యము నీయవలెను.)

### మానవశరీరము

పరమాత్ముని తొమ్మిది ద్వారముల పట్టణమయిన ఈ చిత్రమైన శరీరమను దేవాలయము, శాశ్వత బ్రహ్మమునకు, అంతర్యామికి, అవాఙ్మానసగోచరునకు అద్భుత మయిన నివాసము, ఈ శరీరము జీవునియొక్క లేక వ్యక్తిగత ఆత్మయొక్క ప్రారబ్ధ కర్మకు సంబంధించిన ఉత్పాదనము, అదిజీవునికి, విరాట్ పురుషునికి సంబంధించినది. భౌతికదేహములన్నింటియొక్క సంగ్రహస్వరూపమే విరాట్పురుషుడు. అది ప్రపంచములో అద్భుతమయిన సుకుమారమయిన యంత్రము. దాని యాంత్రిక నిర్మాణము చాల జటిలమైనది. ఈ ప్రపంచములో నిష్ణాతులైన డాక్టర్లు కూడ దానియొక్క నిర్మాణమును, పనిని ఇంకను పూర్తిగా అర్థము చేసికొనలేదు. ఇంకను వారు దానిమీద పరిశోధనలు చేయుచున్నారు. ఒక శక్తివంతమైన అంటు వ్యాధులను కలుగచేయు సూక్ష్మజీవి దానిని నిమిషములో నాశనము చేయగలదు. అన్ని దిశలలో అది చాలామంది శత్రువులచే చుట్టబడియున్ననూ, మానవుడు జీవించు చున్నాడు. ఇదే గొప్ప రహస్యము. ఇది అంతయు పరమాత్మ యొక్క కృపయే.

**– స్వామి శివానంద**



## కోటగిరి మధురస్మృతులు

నాపేరు సత్యానందం. నాకు చిన్నతనం నుండి శాంతిఆశ్రమంతో అనుబంధం వుంది. స్వామీజీ ఓంకార్‌తో గడిపిన బాల్యస్మృతులు నా మనోఫలకం నుండి ఎన్నటికీ చెరిగిపోవు. వాటిలో కొన్ని మీతో పంచుకుంటున్నాను. అప్పుడు నా వయస్సు పది సంవత్సరాలు ఉంటుంది. ఆశ్రమవాసులతో కలసి కోటగిరి వెళ్ళాను. అక్కడి అనుభవాలు కొన్ని...

స్వామి తెల్లవారుఝామున భక్తులకు ఉత్తరాలు, వారి సందేశాలు వ్రాసేవారు. ఆ సమయంలో చలికి తట్టుకోలేక వెచ్చదనం కోసం హీటర్‌కి దగ్గరగా వారి పాదాల దగ్గర కూర్చునేవాడిని. ఒక్కొక్కసారి అచటనే నిద్రపోయేవాడిని. శాంతక్క కేరట్, బీట్‌రూట్, నూల్‌కోల్ వేసి చేసే సూప్ రొట్టితో తీసుకొనే వాళ్ళం. సాయంకాలం నాలుగు గంటలు అయ్యేసరికి పెద్ద గంపతో రొట్టెలు తెచ్చేవ్యక్తి కాలింగ్‌బెల్ కొట్టేవాడు. తలుపుతీసి ఆ రొట్టెలు తీసుకొనేవాళ్ళం. ఆ కాలింగ్‌బెల్ శబ్దము ఇంకా నా చెవులలో మ్రోగుతున్నట్లే వుంది.

ప్రార్థనామందిరం ప్రారంభోత్సవానికి వరాహగిరి వెంకటగిరిగారు (తరువాత మనదేశానికి దేశాధ్యక్షులు అయ్యారు) వచ్చారు. సన్నని గాజుగొట్టంలో 'ఓం' చిహ్నం కరెంటుతో వెలిగేది. ప్రార్థనామందిరం ప్రక్కనే బేరి పండ్ల తోట వుండేది. ఆశ్రమ భవనానికి ఎదురుగా కొండపై పాలు అమ్మేవారి యిల్లు వుండేది. ఆశ్రమానికి, కొండకి మధ్య సన్నని, చల్లని, స్వచ్ఛమైన నీటిప్రవాహం వుంది. టీ తోటలు, ఈ నీటి ప్రవాహం చూడడానికి చాలా మనోహరంగా ఉండేవి, సరిగా గుర్తులేదు కాని, బొబ్బిలిరాణిగారో మరెవరో ఆశ్రమ భక్తులు వచ్చి మమ్మల్ని అందరిని వారి కారుపై ఊటిలోని తోటలు, యితరప్రదేశాలు చూపించి తీసుకువచ్చారు.

ఆశ్రమస్థలంలో కేరట్, బీట్‌రూట్, నూల్‌కోల్, యితర ఆకుకూరలు పెంచే వారు. తోటమాలి రామస్వామి, వారిఅబ్బాయి నాగరాజు. అతని వయస్సు సుమారు ఇరవై సంవత్సరాలు వుంటుందేమో! నాకు పది. రామస్వామి నాతో "బాబూ! మా అబ్బాయి నాగరాజు నామాట సరిగా వినటంలేదు. అల్లరి చిల్లరిగా తిరుగుతున్నాడు. బాధ్యత లేకుండా ఉంటున్నాడు. కొద్దిగా మంచిమాటలు చెప్పి, అబ్బాయికి మీరు భయం చెప్పండి" అని నాతో తరచు అంటూ వుండేవాడు. ఏమి చెప్పానో, ఎలా చెప్పానో గుర్తులేదు కాని, ఒకటి రెండుసార్లు కూరగాయలు పండించే స్థలంలో బోరు నీరు పట్టే నీటి తొట్టెగట్టుపై కూర్చోపెట్టి, అతని భుజం మీద చేయివేసి, పెద్దమనిషి తరహాలో గట్టిగానే చెప్పినట్లు గుర్తు. ఆ సమయంలో మా వయసు తారతమ్యం నాకు తెలియలేదు.

స్వామికి ఎన్నో పనులు, అన్ని పనుల మధ్య కాస్త విరామం దొరికినప్పుడు,

నా భుజం తట్టి, "వెల్! మిస్టర్ సత్యానందం! ఏమిటి సమాచారము?" అనేవారు. లేదా నా బుగ్గలు నిమిరేవారు. నేను ఏవో ఏవో విషయములు చెబుతుండేవాడిని. స్వామీజీ మందిరము, మంచినీళ్ళ నూతికి దగ్గరగా పెద్దబాదంచెట్టు ఇప్పటికి వుంది. ఆచెట్టుకు నాకు ఒక కథవుంది ఇటువంటిదే చాలా పెద్దచెట్టు మల్లిఖార్జునధార మొదట కుడిచేతివైపున వుంటుంది.

ఆనాటి మధురస్మృతులు, సంఘటనలు జ్ఞాపకం వచ్చినపుడల్లా మనస్సు ఆనందంతో నిండిపోతుంది.

(శ్రీ పి.సత్యానందంగారు మాతాజీకి రాసిన లేఖనుండి)

**ఫలించని...**

**శ్రమ విఫలం**
**అయిపోయిందని**
**మథన పడే కన్నా**
**సఫలం కాలేదని**
**అనుకోవడం ఉత్తమం**
**ఆకాశ పొరలలో**
**ఏమి దాగి ఉన్నదో**
**తెలియనట్లు**
**మనసు పొరలలో**
**మరొకరికి తెలియకుండా**
**విఫలం దాచిపెట్టడం ఉత్తమం**
**పర్వతాలన్నీ ఒక్కటి కావు.**
**కొన్నింటికి చరిత్ర ఉంటుంది.**
**ఒక్కొక్కసారి శ్రమలు**
**విఫలమైనా**
**చిరస్మరణీయంగా ఉంటాయి**
**అందుకే దహించకుండా**
**కృశించిపోకుండా**
**వెలుగును నింపు**
**చినుకు జారినప్పుడు**
**ఒక్కొక్కటి జారుతుంది.**
**విషాదం ఒక్కొక్కటిగానే**
**జారుతుంది.**
**ఒక్కొక్కసారి**
**శ్రమ విఫలమైనా భద్రంగానూ,**
**నిశ్శబ్దంగానూ**
**మనసు పొరలలో**
**భద్రంగా దాచుకో !**
**గీత చిన్నదైనా**
**చిత్రకారుడి చేతిలో**
**చాలా గొప్పది.**
**చిన్న గీత నుంచే**
**అందమైన చిత్రం**
**రూపు దాలుస్తుంది.**
**శ్రమ విఫలమైనా గొప్పదే.**
**అందమైన చిత్రం లాంటిదే.**

**బన్న**

కేవల పుస్తక జ్ఞానమాత్రం చేతనే శ్రద్ధ లభిస్తుందా? మితిమీరిన చదవడం గందరగోళాన్ని సృష్టిస్తుంది. బ్రహ్మమొక్కటే సత్యమనీ జగత్తు మిథ్య అనీ శాస్త్రాల నుండి గ్రహించాలి.

**- శ్రీ రామకృష్ణ పరమహంస**



# దైవసాయుజ్యం:
# ప్రశాంత నిష్క్రమణం
## రామ్‌సింగ్ 13-05-2023 శనివారం

రామ్‌సింగ్ శాంతి ఆశ్రమానికి వచ్చినవారందరికీ పరిచితుడే. ఎక్కడనుండి వచ్చాడోకాని ఆశ్రమానికి వచ్చి సుమారు ముప్పై అయిదు సంవత్సరాలు అయింది. హిందీ, ఒరియా భాషలలో మాట్లాడడం, ఒరియాలో ఏవోరాయడం చేసేవాడు. తన అవసరాలను పట్టించుకొనువాడుకాడు. దుస్తులు కూడ ఎవరయినా బలవంతంగా మారిస్తే మార్చుకొనేవాడు. డబ్బులు, తినేవస్తువులు ఆశ్రమవాసులు ఇస్తే తిరస్కరించేవాడు. ఒక్కటీ మాత్రమే అతనికి ఇష్టమయినది. ఆశ్రమమును పరిశుభ్రంగా ఉంచడంలోనే నిరంతరం శ్రమించేవాడు. ఇతరుల విషయాలలో కలుగ చేసుకొనేవాడు కాదు. భయంలేదు, భావాతీతుడు. మంచిచెడు వికారాలు లేవు. హీనహైన్య భావాలు లేవు. ఆకలేస్తే కంచాలు కడిగే తొట్టిలోని మెతుకులైనా ఏరుకు తినేవాడు. కడుపు నిండితే మామిడిపండ్లు ఇచ్చినా పుచ్చుకొనేవాడుకాదు. తిన్నతరువాత చేతులు మూతి కడుక్కొనట్లే మాలమూత్ర విసర్జన తరువాత కూడ శరీరాన్ని శుభ్రం చేసుకొనే వాడు కాదు. కాని అతని శరీరం నుండి ఏ మాత్రం దుర్గంధం వచ్చేదికాదు. మానావమానాలకు ఆదరణ తిరస్కరణలకు అతీతంగా ఉండేవాడు.

ఒక అవధూతలా జీవించిన రామ్‌సింగ్ 13-05-2023 శనివారం స్వల్ప అస్వస్థతతో దేహం చాలించాడు. అతని మరణం ఆశ్రమవాసులందరికి దిగ్భ్రాంతి కలిగించింది. మరునాడు సమాధిచేసే సమయానికి కూడా అతని శరీరం వాసన రావడంగాని, శరీరంమీద ఈగలు, దోమలు, చీమలు చేరటంగాని జరగలేదు. అతని ఆత్మశాంతి కోరుతూ ఆశ్రమవాసులు మృత్యుంజయమంత్రం జపించారు. ఆ శుద్ధ ఆత్మ పరమాత్మలో లీనమవుగాక!

"జ్ఞానయోగము చాల కఠినమైనది, దేహాత్మబుద్ధి వదలనిచో జ్ఞానము కలుగదు సుమా! కలియుగమున జీవులు అన్నగత ప్రాణులు-దేహాత్మబుద్ధి అహంబుద్ధి పోదు. అందుచే కలియుగమునకు తగినది భక్తియోగమే!

భక్తియోగము సులభమగు మార్గము, అంతరంగమున వ్యాకులచిత్తము తోడ భగవంతుని నామగుణగానము చేయుచు, వానిని ప్రార్థన చేయుము. భగవద్దర్శనము ఖచ్చితముగ నొందగలవు. సందేహమే లేదు.

**- శ్రీ రామకృష్ణ పరమహంస**

# కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

## అర్ధచాతుర్మాసము

**తేది 03-07-2023 (సోమవారం) నుండి ది. 31-08-2023 (గురువారము) వరకు :** పరమ పూజ్యశ్రీ ఓంకారస్వామి దివ్యాశీస్సులతో పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీ వారి ఆధ్వర్యములో నిర్వహింపబడును.

**తేది.03-07-2023 (సోమవారం) నుండి ది.31-08-2023 (గురువారము) వరకు :** ఉ॥6.30ని॥లకు శ్రీలక్ష్మీనారాయణ అష్టోత్తర శతనామార్చన నిర్వహింపబడును. ది. 31-08-2023 ఉ॥ 8.30ని॥లకు పిఠాపురం వాసులు శ్రీ భాష్యం సీతారామమూర్తిగారిచే హెూమం నిర్వహించబడును.

**తేది 03-07-2023 (సోమవారం) :** గురుపూర్ణిమ సందర్భంగా ఉ॥7.30ని॥లకు శ్రీ వ్యాసులవారి మరియు పూజ్యశ్రీ ఓంకారస్వాములవారి అష్టోత్తర శతనామార్చన స్వామిని శారదానంద వారిచే నిర్వహించబడును.

**తేది 14-07-2023 (శుక్రవారం) :** స్వామి శివానంద మహరాజ్ ఆరాధన.

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ : 7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,<br>కోటగిరి - 643217,<br>నీలగిరి జిల్లా, తమిళనాడు<br>ఫోన్ : 04266 - 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org



# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

## శాశ్వత అన్నదానం

1. శ్రీ కె. సుబ్రహ్మణ్యంగారు (చోడవరం) 20,000/-
వీరి శ్రీమతి కె.నాగజ్యోతిగారి జ్ఞాపకార్థం
2. శ్రీ దారా విజయ్‌కుమార్‌గారు (పూనా) 10,000/-
వీరి అత్తగారు శ్రీమతి మోటమర్రి అచ్యుత సీతాకుమారి గారి జ్ఞాపకార్థం
3. శ్రీ తులసి బాలకృష్ణగారు (హైదరాబాదు) 16,000/-
వీరి పుట్టినరోజు సందర్భముగా మరియు వీరి సోదరుడు శ్రీ టి.భాస్కరరావుగారి జ్ఞాపకార్థం
4. శ్రీ వి. మహేష్‌కుమార్‌గారు (బెంగుళూరు) 25,000/-
5. శ్రీ సి.ఎస్.శాస్త్రి గారు (శాంతి ఆశ్రమం) 8,000/-
వీరి మనుమరాలు చి॥అదిత్రిగారు పుట్టినరోజు సందర్భముగా
6. శ్రీమతి మల్లా ఉషారాణి గారు (హైదరాబాదు) 10,000/-
వీరి పుట్టినరోజు సందర్భముగా
7. డా॥యెందేటి లక్ష్మిగారు (నెల్లూరు) 10,000/-
వీరి కుమారుడు సంజీవరావు నారాయణ ఆనంద్‌గారి జ్ఞాపకార్థం
8. శ్రీమతి సూరాబత్తుల పద్మావతి గారు (రాజమండ్రి) 8,000/-
శ్రీ సూరాబత్తుల రాధాకృష్ణమూర్తి గారి జ్ఞాపకార్థం
9. శ్రీ గొల్లపూడి సాయినాధరావుగారు (గొల్లప్రోలు) 11,000/-
వీరి తండ్రి వెంకటేశ్వరరావు గారి జ్ఞాపకార్థం
10. శ్రీ మర్రెడ్డి ధర్మారెడ్డి గారు (కాజా వెంకటరెడ్డిపాలెం) 5,000/-
వీరి తండ్రిగారు మర్రెడ్డి రామకృష్ణారెడ్డి గారి జ్ఞాపకార్థం

## విరాళములు

1. స్వామి సిద్దానందగిరి గారు (శాంతి ఆశ్రమం) 63,002/-
అన్నదానం - వస్త్రదానం నిమిత్తం
2. డా॥ కోనేరు రామతులసిగారు (విశాఖపట్నం) 49,000/-
బిల్డింగ్ రిపేర్సు నిమిత్తం
3. సత్య ఛారిటబుల్ ట్రస్టు 5,000/-
4. శ్రీ పి. రామకృష్ణారెడ్డి గారు (హైదరాబాదు) 1,00,116/-
5. శ్రీమతి గరిమెళ్ళ రేణుకగారు (హైదరాబాదు) 4,000/-
పూజలు, పండుగలు నిమిత్తం



6. శ్రీమతి చుందూరి అమృత (గుంటూరు) 3,000/-
పూజలు, పండుగలు నిమిత్తం
7. శ్రీమతి వసంత భారతుల గారు (న్యూఢిల్లీ) 1,06,440/-
సోలార్ ఫెన్సింగ్ నిమిత్తం
8. డా॥ప్రదీప్ రాంలాల్ గారు(ఋషికేష్) 3,000/-
శాశ్వత విద్యానిధి నిమిత్తం
9. శ్రీమతి కె.రమణిగారు (విశాఖపట్నం) 15,000/-
10. సీతారామ సేవా ట్రస్టు (హైదరాబాదు) 32,000/-
11. శ్రీ యర్రాప్రగడ సత్యనారాయణ గారు (బెంగుళూరు) 1,00,000/-
12. డా॥ కృష్ణారాం భరతుల (న్యూఢిల్లీ) 2,25,306/-
13. శ్రీ పద్మరాం చవాన్ గారు (ముంబాయి) 15,000/-
14. మీరా హెచ్.పార్థసాని గారు (వడోదర) 10,001/-
15. శ్రీ మర్రి కృష్ణారెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్టు (సికింద్రాబాద్) 72,000/-
డా॥ మర్రి చెన్నారెడ్డి గారి జ్ఞాపకార్థం అన్నదానం మరియు విద్యాఖర్చులు నిమిత్తం
16. శ్రీ పోలిశెట్టి పాండురాగారావు గారు 6,001/-
17. శ్రీ కొమరగిరి వెంకట రామారావు గారు (రాజమండ్రి) 10,000/-
18. శ్రీ మలిశెట్టి వెంకట రవికుమార్ గారు (బెంగుళూరు) 10,000/-
వీరి కుమార్తె మలిశెట్టి ప్రవీణగారి వర్థంతి సందర్భంగా అన్నదానం
19. శ్రీ ఐ. కేశవరావు గారు (హైదరాబాదు) విద్యాఖర్చుల నిమిత్తం 12,000/-
20. శ్రీ కె.డి.రావు గారు (సికింద్రాబాదు) LT Col+15,000/-
21. డా॥ ఎమ్.వి. భరతలక్ష్మి గారు (కాకినాడ) 1,10,000/-
విద్యానిథి నిమిత్తం
22. శ్రీ ఎల్.వి. శ్రీకిరణ్ గారు (కత్తిపూడి) 5,000/-
23. శ్రీమతి యెందేటి లక్ష్మిగారు (నెల్లూరు) 40,000/-
గోసంరక్షణ నిమిత్తం
24. శ్రీ వాసవి సుబ్బారావు గారు (నెల్లూరు) 5,000/-
25. శ్రీ పైడా శ్రీరామ కె.ఫౌండేషన్ (కాకినాడ) 1,00,000/-
హైస్కూల్ బిల్డింగ్ పెయింటింగ్ నిమిత్తం
26. యు.వి.కాశిరాజు గారు (విశాఖపట్నం) 10,000/-
27. శ్రీ వి. నాగశ్రీనివాసరావు గారు (అనంతపల్లి) 10,116/-

## శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. ఓంకార సద్బోధామృతము | 70/- |
| 3. సోహం | 10/- |
| 4. ఓం జపం | 10/- |
| 5. మౌనపు ఘడియలు | 30/- |
| 6. ప్రేమయే దైవము | 10/- |
| 7. భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. శాంతి దళములు | 10/- |
| 9. ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. సత్సంగ సందేశములు | 30/- |
| 11. ఓంకార సూక్తులు | 10/- |
| 12. ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 13. శాంతి సూక్తులు | 10/- |
| 14. శాంతి ప్రార్థన | 20/- |
| 15. శ్రీ శాంతి స్తోత్రమాల | 30/- |
| 16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 17. సందేశ తరంగిణి | 40/- |
| 18. నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. | 20/- |
| 20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము | 20/- |
| 21. శాంతి దూత స్వామి ఓంకార్ | 30/- |
| 22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) | 100/- |
| 24. ధ్యానము | 30/- |
| 25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 26. ప్రార్థనలు - ధ్యానములు | 20/- |
| 27. విశ్వ ప్రార్థన | 20/- |
| 28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ది సంచిక | 120/- |
| 29. నిత్య సందేశములు | 20/- |
| 30. ఆంతర్య భావనలు | 20/- |
| 31. శ్రీ ఓంకార బోధామృతం | 20/- |
| 32. నాల్గు దశలలో ఉపదేశము | 10/- |
| 33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ | 20/- |

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | |
|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. 10/- |
| 3. Soham | Rs. 10/- |
| 4. Cosmic Fast | Rs. 20/- |
| 5. Meditation | Rs. 10/- |
| 6. Om Japa | Rs. 10/- |
| 7. Control of Mind | Rs. 30/- |
| 8. Cosmic Flashes | Rs. 10/- |
| 9. In the Hours of Silence | Rs. 10/- |
| 10. The Soul of Omkar | Rs. 10/- |
| 11. How I learned English | Rs. 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. 10/- |
| 13. God Realization Now and Here | Rs. 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. 100/- |
| 17. Petals of Peace | Rs. 20/- |
| 18. The Story of my life and Work | Rs. 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. 10/- |
| 20. The Four Initiations | Rs. 10/- |
| 21. Musings | Rs. 20/- |
| 22. Peace Prayer | Rs. 20/- |

**THE MISSION OF PEACE**

**శ్రీ శాంతి ఆశ్రమము**

పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
తూ॥గో॥జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

Printed by Mohan Graphics and Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda